వెలగని లైట్లు


ఎస్సారెస్పీ ఆనకట్టపై నిరుపయోగంగా ఉన్న స్తంభాలు

- పోచంపాడ్‌లో రెండేళ్లుగా వెలగని సెంట్రల్ లైటింగ్ బల్బులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ జాతీయ రహదారి కూడలి నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి ప్రాజెక్ట్ వరకు మూడు కిలో మీటర్ల మేర 2014లో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత వాటి నిర్వహణను అధికారులు మరిచిపోయారు. గత రెండేళ్ల నుంచి అవి పనిచేయడం లేదు. దీంతో సెంట్రల్ లైటింగ్ మరమ్మతుల కోసం గత ప్రభుత్వానికి ప్రాజెక్ట్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీంతో రూ. 39 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ రోడ్డును మరింత విస్తరించి డివైడర్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలోని పాలకులు ఇరిగేషన్ నిధులను రద్దు చేశారు. కానీ తర్వాత రోడ్డు డివైడర్ నిర్మాణానికి, సెంట్రల్ లైటింగ్ కోసం ఇప్పటి వరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ లైట్ల గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. జాతీయ రహదారి నుంచి కాలనీలోకి నిత్యం అనేక మంది వెళ్తుంటారు. గతంలో చీకటిగా ఉన్న ఈ ప్రాంతంలో రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఈ ఘటనల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. అయినా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు.


పోచంపాడ్‌లో బల్బులు వెలగని స్తంభాలు

అలాగే ప్రాజెక్ట్ ఆనకట్టపై కూడా లైట్లు వెలగడం లేదు. కేవలం వరద గేట్ల వద్ద మాత్రమే బల్బులు వెలుగుతున్నాయి. ప్రాజెక్ట్ ఆనకట్టపై ఎలాంటి భద్రత లేక పోవడంతో పెట్టిన బల్బులను కొందరు ఆకతాయిలు పగలకొడుతున్నారు. దీంతో అధికారులు బల్బులు పెట్టడమే మానేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బల్బులు వెలిగేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాలేదు

జాతీయ రహదారి నుంచి ప్రాజెక్ట్ వరకు ఉన్న రోడ్డు డివైడర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటి వరకు ఎలాంటి నిధులు రాలేదు. గతంలో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి.

– అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

క్లుప్తంగా

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి



బాల్కొండ: కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని మెండోరా మండలం పోచంపాడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేశ్ అన్నారు. గురువారం పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కుటుంబ నియంత్రణకు ఆపరేషన్‌లతో పాటు వివిధ పద్ధతుల ద్వారా నియంత్రించవచ్చని అన్నారు. కార్యక్రమంలో వైద్యుడు అనిల్, హెల్త్‌ఎడ్యుకేటర్ మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు అందజేత



రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ ప్రాథమిక పాఠశాలలో 65 మంది పేద విద్యార్థులకు గురువారం కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకట సుబ్బారావు, బీజేపీ రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, విలాస్, బి శ్యామ్, వెంకటేశ్, ప్రకాశ్ పటేల్, ఉపాధ్యాయులు పాపారావు, నర్సింలు, సుధీర్, రాధిక, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నందిపేట్: మండలంలోని వెల్మల్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆర్మూర్ నుంచి నందిపేట వెళ్లే బస్సు వెల్మల్ గ్రామానికి అర కిలోమీటరు దూరంలో బైపాస్ రోడ్డు గుండా వెళ్తుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ గ్రామస్తులకు సౌకర్యవంతంగా ఉండేట్లు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఆర్మూర్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో పర్యావరణ సంరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్, దాచపల్లి సంతోష్, జెంటిల్ కిడ్స్ ప్రకాశ్, పాల్కం వేణు, గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటిపై దాడి దుర్మార్గం

మోర్తాడ్: వేల్పూర్ మండల కేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడి దుర్మార్గమని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజారాం యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని వదిలేసి, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను అరెస్టు చేయడం కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనకు నిదర్శనమన్నారు.

స్టేడియం నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



బాల్కొండ : ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న భూదేవి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థానిక మాజీ సర్పంచ్ ముస్కు భూమేశ్వర్ గురువారం రూ. 50 వేలను విరాళంగా అందించారు. అనంతరం దాతను నిర్మాణ నిర్వాహకులు, క్రీడాకారులు సన్మానించారు. ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి దినేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి


నందిపేటలో మాట్లాడుతున్న నాయకులు


మంథనిలో మాట్లాడుతున్న నాయకులు

నందిపేట్/ పెర్కిట్: వికలాంగులు, చేయూత పెన్షన్‌దారులు సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కుండాల స్వామి, జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి కోరారు. నందిపేట మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ.. ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించే వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల గర్జన మహాసభ విజయవంతం కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో సన్నాహక సభ జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు కలిగోట సంతోష్, వెల్మల్ గంగాధర్, ఆర్మూర్ శంకర్, గంగ మల్లయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు. ఆర్మూర్ మండలం మంథనిలో వికలాంగులు, చేయూత పింఛన్‌దారులతో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహించే సభ విజయవంతం కోసం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎమ్మార్పీస్ జిల్లా ఇన్‌చార్జి కూడాల స్వామి, పోశెట్టి, మైలారం బాలు, మైలారం రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్


బాల్కొండ పీఎస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు


ముప్కాల్ పీఎస్‌లో కాంగ్రెస్ నాయకులు

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా గురువారం అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వేల్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో అరెస్టులు చేసి స్వంత పూచీకత్తుపై వదిలి పెట్టారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రుణాలివ్వాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

బోధన్‌టౌన్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల నుంచి రుణాలను మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ సూచించారు. గురువారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు డ్వాక్రా సంఘంలో లేకుంటే వారిని మహిళా సంఘం సభ్యులతో చర్చించి సంఘంలోకి తీసుకొని రుణం అందించాలన్నారు. ఆర్పీలు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రమేశ్, మెప్మా టీఎంసీ శ్రీనివాస్, సీవో శ్రీనివాస్ ఉన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి


శిబిరంలో చికిత్స చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ అరుణ

ఆర్మూర్: తెలంగాణ సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీని వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. భవిత కేంద్రంలో ప్రతి వారం ఉచితంగా ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నామన్నారు. ఫిజియోథెరపిస్ట్ అరుణ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్స అందించారు. శిబిరంలో ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్ కిషన్, సురేశ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదుపై సమావేశం



వేల్పూర్: మండల కేంద్రంలోని హైస్కూలులో గురువారం పీఆర్టీయూ నాయకులు సభ్యత్వ నమోదుపై కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని నిర్ణయించారు. పీఆర్టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పెంట జలంధర్ కుకునూర్ హైస్కూల్ హెచ్‌ఎం హరిచరణ్‌కు సభ్యత్వం అందజేసి నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బోడ దేవానందం, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, పతాని గంగాధర్, విజయ్‌కుమార్, సురేశ్ పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బోధన్: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలననుసరించి పాఠశాలలు, కళాశాలల్లో వనమహోత్సవాన్ని ఉత్సాహంతో నిర్వహించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందితో కలిసి పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పండ్లు, పూలు, ఔషధం, నీడ నిచ్చే మొక్కలను నాటాలని సూచించారు. పర్యావరణ సంరక్షణ ప్రాధాన్యత పై అవగాహన కల్పించడం,పచ్చదనాన్ని బలోపేతం చేయడం వనమహోత్సవ లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రముఖ ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలకు రాతపూర్వకంగా సబ్ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించిన ప్లానింగ్ కోసం స్థానిక మున్సిపాలిటీ, అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన



పెర్కిట్: ఐఐటీ బనారస్ యూనివర్సిటీలో ప్రవేశం సాధించిన ఆర్మూర్ పట్టణానికి చెందిన జెస్సు అశ్రితను అంకాపూర్‌లో గురువారం ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది జెస్సు అనిల్ కుమార్తె జెస్సు అశ్రిత ఇటీవల జేఈఈ అడ్వాన్సులో ఉత్తమ ర్యాంకు సాధించి ఐఐటీ బనారస్ యూనివర్సిటీలో ప్రవేశాన్ని పొందారు. దీంతో ఎమ్మెల్యే విద్యార్థినిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కారంచెడు అమర వీరులకు ఘన నివాళులు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కారంచెడు అమర వీరులకు దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘన నివాళులు అర్పించారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. 1985జూలై17న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాలోని కారంచేడు గ్రామంలో దళితులపై కమ్మ కుల భూస్వాములు క్రూరమైన దాడి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొక్కెర భూమన్న, ప్రదీప్, మూగ ప్రభాకర్, దాసు, గంట సదానందం, కొంతం మురళి, స్వామి, ఎల్‌టీ కుమార్, పులి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇంటింటికి వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని ఇన్‌చార్జి సానిటరి ఎస్సై సురేశ్ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని 11, 26వ వార్డుల్లో వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు ప్రవళిక, నితీశ్, శానిటరి జవాన్లు, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

మాక్లూర్: అరుణోదయ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఇల్లందులో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా క మిటీ నాయకుడు దేశెట్టి సాయిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సదస్సును కళాకారు లు, మేధావులు జయప్రదం చేయాలన్నారు.

తడి ఆరిన మక్క పంట


వేంపల్లిలో తడిలేక ఎండుతున్న మక్క పంట

బాల్కొండ: వర్షాలు కురవక పోవడంతో పంటలకు నీరు అందక ఎండుతున్నాయి. గత పక్షం రోజుల నుంచి వర్షం కురువక పోవడంతో పాటు ఎండలు విపరీతంగా కాస్తుండటంతో సాగు చేస్తున్న మక్క పంట ఎండిపోతుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు నీరు అందించేందుకు నానా పాట్లు పడుతున్నారు. భూగర్భ జలాలు లేని రైతుల పంటలు ఎండిపోతున్నాయి. మరో వారం రోజులు ఇలాగే ఉంటే పంటలు పూర్తిగా ఎండి పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


తాడ్‌బిలోలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


రాకాసీపేట్‌లో కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో గురువారం సీసీ, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే నిధులను సక్రమంగా వినియోగించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కాలనీలో రూ. 15 లక్షలతో డ్రెయినేజీని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీకి రోడ్డు నిర్మించాలని, కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వేరే ప్రాంతంలో బిగించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. గ్రామంలో సుమారు 50 వరకు ఇళ్లు గ్రామకంఠంలో ఉన్నాయని వాటిని ఆబాదిలో చేర్చాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని అన్నారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న రెంజల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల సాయారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, నాయకులు ధనుంజయ్, సాయిబాబాగౌడ్, వెల్మల నర్సయ్య, రామాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, ఆసాని అనిల్, కుర్మె శ్రీనివాస్, ఎంపీడీవో కమలాకర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

బోధన్‌టౌన్: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బల్దియా అధికారులకు సూచించారు. పట్టణంలోని 5, 7, 17, 30 వార్డుల్లో పర్యటించారు. రాకాసీపేట్, ఫోస్టాఫీస్‌తో పాటు ఇతర కాలనీల్లో ఉన్న మురికి కాలువలతో పాటు సాగునీటి కాలువలపై నిర్మించిన కల్వర్టులు శిథిలావస్థకు చేరాయని, కొన్ని పూర్తిగా కూలి పోయాయని వాటిని గుర్తించి నిర్మాణాలు చేపట్టేలా చూడాలని సూచించారు. పలు కాలనీల్లో నిర్మిస్తున్న కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హాస్టల్‌లో కోతుల బెడద


హాస్టల్ గోడపై ఉన్న కోతులు

బాల్కొండ: మండల కేంద్రంలోని బీసీ మహిళా హాస్టల్ భవనం వద్ద నిత్యం కోతులు మందలు, మందలుగా గోడపై ఉంటున్నాయి. దీంతో విద్యార్థినులు హాస్టల్ భవనం లోపలికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ భవనం ఆవరణలో పెద్ద పెద్ద చెట్లు ఉండటంతో వాటికి ఆవాసంగా మారాయి.

దీంతో ప్రతి రోజు కోతుల బెడద ఎక్కువవుతోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పండ్ల షాపు తొలగింపు విషయమై ఉద్రిక్తత


ఇరువర్గాలను సముదాయిస్తున్న ఎస్సై సాయన్న

రుద్రూర్ : మండలంలోని అక్బర్‌నగర్ శివారులో కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న పండ్లు విక్రయిస్తున్న గుడిసె తొలగింపు విషయమై గురువారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పండ్ల షాపు నిర్వహిస్తున్న వారికి, వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతికి మధ్య జరిగిన వాగ్వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌నగర్‌కు చెందిన హబీబ్ ఖాన్ పరిశోధన కేంద్రంలో ఉన్న పండ్ల చెట్లు లీజుకు తీసుకుని ప్రధాన రహదారి పక్కనే గుడిసె వేసుకుని విక్రయిస్తున్నాడు. గత నెలతో లీజు గడువు ముగిసిందని పరిశోధన కేంద్రం సమీపంలో పండ్ల విక్రయాలు నిలిపివేసి గుడిసె తొలగించాల్సిందిగా అధిపతి సదరు వ్యాపారిని ఆదేశించాడు. జీవనోపాధి కోసం ప్రధాన రహదారి సరిహద్దులో గుడిసె వేసుకుని పండ్లు విక్రయిస్తున్నామని దీన్ని తొలగించాలని చెప్పడం సమంజసం కాదని వ్యాపారి అభ్యంతరం తెలియజేశాడు. గుడిసె వేసిన స్థలం పరిశోధన కేంద్రానికి సంబంధించినదని అధిపతి పేర్కొంటుండగా, గుడిసె రోడ్డు సరిహద్దులో ఉందని వ్యాపారి సంబంధీకులు వాదించారు. ఈ విషయమై పరిశోధన కేంద్రం సిబ్బందికి , వ్యాపారి సంబంధీకుల మధ్య వాగ్వాదం జరగడంతో ఘర్షణ వాతవరణం చోటుచేసుకుంది. దీంతో ఎస్సై సాయన్న ఘటన స్థలానికి చేరుకుని ఇరువురిని సముదాయించి పరిస్థితి అదుపులోకి తెచ్చారు.

ప్రతి మంగళవారం జాతరే..


ఎల్లమ్మ ఆలయంలో భక్తుల తాకిడి

- కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయానికి పెరుగుతున్న భక్తుల తాకిడి
- ఇతర జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్న భక్తులు



నందిపేట్: మంగళవారం వస్తే చాలు ఆ ఆలయంలో భక్తుల సందడి నెలకొంటుంది. ఈ విశిష్ట ఆలయం నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో ఉంది. ఇక్కడి ఎల్లమ్మకు ఎన్నో మహిమలు ఉన్నాయని భక్తులు విశ్వసిస్తుంటారు. మంగళవారంతో పాటు ఆదివారం సైతం చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, మహారాష్ట్రలోని ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

కోనేటి నీటితో ఆరోగ్యం

ఆలయానికి వచ్చే భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేటి నీటితో స్నానం చేస్తారు. ఈ నీటితో స్నానం చేస్తే చర్మవ్యాదులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో భక్తులు కోనేటి నీటిని వెంట తీసుకెళ్తారు. అంతేకాకుండా పంటలు వేసే ముందు అమ్మవారిని దర్శించుకుని వెళ్తే బాగా పండుతాయని రైతులు విశ్వసిస్తుంటారు.

దేవాదాయశాఖ పరిధిలో..

సుమారు 300 ఏళ్ల క్రితం వెలసిన కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో కొనసాగుతోంది. దీంతో దేవదాయశాఖ అధికారులు ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.